

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఫ్రెంచ్ కిస్

**ఇరవై ఏళ్ళ గౌతమికి** ఓ తీరని కోరిక ఉంది. 1960లు 1970ల కాలంనాటి కథల్లో మధ్య తరగతి జీవులకి ఉండేలాంటి వాలు కుర్చీ, సైకిల్, జడ కుప్పెలు, ఫొటోల్లాంటి డబ్బుతో ముడిపడిన తీరని కోరిక కాదది. బంధంతో ముడిపడింది.

గౌతమి కోరిక ముద్దు! అవును ముద్దే! కాకపోతే బుగ్గమీదో, నుదిటి మీదో పెట్టుకునే ముద్దుకాదు. పెదవుల మీద పెట్టుకునే ముద్దు. తన పదహారో ఏట నించే గౌతమికి ఆ కోరిక ఉంది. పాత సినిమాల్లో పొదలచాటున పరోక్షంగా, కొత్త సినిమాల్లో ప్రత్యక్షంగా చూసిన ముద్దు సీన్స్ ఆమెలో ఆ కోర్కెని రేపాయి. ఆ తర్వాత ఆ హీరోయిన్ హావభావాలు చూసినప్పుడల్లా గౌతమి ఆశ్చర్యపోయేది. నిజంగా ముద్దు అంత మధురంగా ఉంటుందా? ఆమెలో అదేదో తెలుసుకోవాలనే కోరిక గాఢమైనప్పటికీ పుట్టి పెరిగిన వాతావరణం, తండ్రంటే ఉన్న భయం ఆ అవకాశం లేకుండా చేసాయి.

డిగ్రీ తర్వాత తనకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని తెలిసినప్పుడు కెరీర్ మీద ఏమాత్రం ఆసక్తి లేని గౌతమి ఆనందపడింది. పెళ్ళివల్ల తనకో కుటుంబం ఏర్పడుతుందనే కాదు, ముద్దులోని మర్మం తెలుసుకునే అవకాశం వచ్చిందని, దాన్ని ఆస్వాదించచ్చనే ఆనందం కూడా అందులో ఇమిడి ఉంది.

పెళ్ళి చూపులకి వచ్చినవాళ్ళ పెదవుల వంకే చూసేది. కనుముక్కు తీరుని ఆమె పట్టించుకునేది కాదు. నల్లటి పెదవులు, లావు పెదవులు, సిగరెట్ తాగిన గుర్తులున్న పెదవులు ఇంకా చాలా రకాల నోళ్ళ వాళ్ళని చూస్తూంటే ఆమె

భయపడిపోయేది. వాళ్ళు యస్ అంటే తండ్రి తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా వాళ్ళతో పెళ్ళి చేసేస్తాడని ఆమెకి తెలుసు. కాని అదృష్టవశాత్తూ వాళ్ళడిగిన కట్న కానుకలకి తూగలేక ఆ సమబంధాలు వెనక్కిపోయాయి. కొంతకాలం ఆయన పెళ్ళి ప్రయత్నాలని ఆపేసాడు.

ఏడాది తర్వాత తనని చూడడానికి వచ్చిన వసంత్ ఆమెకి అమితంగా నచ్చాడు. లేత గులాబీ రంగులోని అతని తీరైన పెదవులు, చక్కటి ముఖకవళికలు, అతను చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. ఆమె తొలిసారిగా దేవుడ్ని ప్రార్థించింది.

"నేను నిన్నెప్పుడూ ఏ కోరికా కోరలేదు. ఇప్పుడే అడుగుతున్నాను. ఈ వసంత్‌కి నేను నచ్చి, మా నాన్న ఇచ్చే కట్నం నచ్చి నన్ను పెళ్ళి చేసుకునేట్లు చేయవా ప్లీజ్?"

వాళ్ళనించి కబురు వచ్చేదాకా గౌతమి అల్లాడిపోయింది. తండ్రిని అడగడానికి భయం, తల్లిని అడగడానికి సిగ్గు అడ్డొచ్చాయి. ఓ మంచిరోజున తండ్రి తల్లితో ఆనందంగా చెప్పేమాటలు వినిపించాయి.

"అబ్బాయికి గౌతమి నచ్చిందిట. కట్నకానుకలేం వద్దు. పెళ్ళికూడా సింపుల్‌గా చేయమన్నారు."

"ఎంత శుభవార్త! అబ్బాయికూడా చక్కగా ఉన్నాడు" తల్లి తృప్తిగా చెప్పింది. గౌతమి గబగబ దేవుడి గూడు దగ్గరకి వెళ్ళి చెంపలు వేసుకుని, దణ్ణం పెట్టి దేవుడికి మౌనంగా తన కృతజ్ఞతలని తెలియచేసుకుంది.

పెళ్ళయిన వెంటనే పెళ్ళికొడుకు వెళ్ళిపోతాననడం పెద్దవాళ్ళు జీర్ణించుకోలేకపోయారు.

"తర్వాత కార్యక్రమాలు..." గౌతమి మేనమామ నసిగాడు.

వసంత్ ప్రశ్నార్థకంగా చూసాడు.

"అదే శోభనం.." ఆయన గొంతు తగ్గించి చెప్పాడు.

వసంత్ నవ్వి చెప్పాడు. "గౌతమికూడా నాతో వస్తుంది కదా! అక్కడ మా ఇంట్లో చేసుకుంటాం. ఇక్కడ ఇంతమంది మధ్య నాకు ఇష్టంలేదు ఇంకో మాట. తనతోకాని, నాతోకాని ఎవరూ రావద్దు. కొన్ని రోజులు మేమిద్దరమే ఉండి, ఒకరినొకరం అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత మేం చెప్పినప్పుడు మీ అందరూ రావచ్చు. పెళ్ళి చేసి పంపుతున్నారు కాబట్టీ మీకెవరికీ అభ్యంతరం ఉండదనే అనుకుంటున్నాను."

పెళ్ళింట్లోని సగం మంది ఆ మాటలకి పెదవి విరిస్తే, సగం మంది బుగ్గలు నొక్కుకున్నారు. గౌతమి మాత్రం తన భర్త ఎంత సున్నితంగా ఆలోచించాడు అని మురిసిపోయింది.

చేసేది లేక వెయ్యి జాగ్రత్తలు చెప్పి ఆమెని అల్లుడితో పంపించారు. తల్లితండ్రుల మనసులో బాధ. పెళ్ళి కొచ్చిన వాళ్ళలో అవమానం పాలయ్యామనే కాక ఇంత మొండిఘటం కూతుర్ని ఎలా చూసుకుంటాడో అనే అనుమానం కూడా వాళ్ళలో ఉంది. ఇవేమీ పట్టని గౌతమి కారు వెనక సీట్లో భర్త పక్కన కూర్చుని నవ్వుతూ వారికి వీడ్కోలు చెప్పింది.

'బ్రహ్మచారి ఇల్లు ఎలా ఉంటుందో?' అనుకుంది గౌతమి. కాని వసంత్ ఇల్లు అద్దంలా నీడలు కనబడుతూ, అతి శుభ్రంగా ఉంది. ఇంటికి రాగానే గౌతమికి ఇల్లు చూపించాడు. సామీప్యంలో ఉంది కాబట్టి చొరవ చూపిస్తాడు అనుకుంది కాని వసంత్ ఆమెకి బాత్‌రూం చూపించి చెప్పాడు.

"స్నానం చేసిరా. నేను రెండో బాత్‌రూంలో చేస్తాను. ప్రయాణం చేసొచ్చి స్నానం చేయకుండా మంచం మీద, సోఫాల్లో కూర్చోవడం నాకిష్టంలేదు. నీ సూట్ కేస్ నేలమీద పెట్టి ఓపెన్ చేసి, బట్టలు ఈ కబోర్డ్‌లో సర్దుకో. మంచం మీద సూట్ కేస్‌లు, లాప్ టాప్‌లు పెట్టడం నాకు ఇష్టం ఉండదు."

అతని మాటలు విచిత్రంగా ఉన్నా గౌతమి అతను చెప్పినట్లే చేసింది. ఆమె తయారై బయటకి వచ్చేసరికి వసంత్ వంట మొదలుపెట్టాడు.

"అయ్యో! నేనొచ్చి చేసేదాన్నిగా. ఐనా ఆర్డర్ చేయాల్సింది" మొహమాటంగా చెప్పింది.

"వాళ్ళు కూరగాయలు సరిగ్గా కడుగుతారా లేదా, పురుగులు ఉన్నాయో లేదో చూస్తారా లేక స్పీడ్‌గా తరిగేస్తారా అని భయం నాకు. అందుకే ఇంట్లో తింటాను" వసంత్ స్నేహపూర్వకంగా నవ్వుతూ చెప్పాడు.

అతని అతి శుభ్రం గురించి గౌతమికి పూర్తిగా అర్ధమైంది. భర్త చేతిలోంచి పని అందుకుంది. అరగంటలో వంటైపోయి తినేసారు. తర్వాత ఓ అరగంట టి.వి చూసారు. గౌతమిలో ఒక విధమైన ఉత్కంఠ, భయం అయోమయం అన్ని భావాలు చెలరేగుతున్నాయి. చివరికి వసంత్ టి.వి ఆపేసి చెప్పాడు. "ఇంక పడుకుందాం..."

ఉప్మా కోసం అల్లం, పచ్చి మిరపకాయలు తరుగుతున్న గౌతమికి నిరాశగా ఉంది. కానీ దాన్ని మించిన ఆశ్చర్యం ఉంది. ఏంటీ అబ్బాయ్. ఇరవై ఎనిమిదేళ్ళ అబ్బాయికి ఈ అతి శుభ్రం ఏంటి? రాత్రి ఎన్నోసార్లు పెదాలని అతని పెదవులకి తాకించడానికి ప్రయత్నించింది. కాని అన్ని సార్లు మొహం పక్కకి తిప్పుకున్నాడు. చివరికి బుగ్గమీద ముద్దుపెట్టి చెప్పాడు.

"నోటి మీద వద్దు ప్లీజ్. ఎంగిలి."

గౌతమి త్వరలోనే వసంత్‌తో సహజీవనానికి అలవాటు పడిపోయింది. వసంత్ మంచి భర్త. మంచి మనిషి. అతి శుభ్రం తప్ప అతనిలో లోపాలు లేవు. భార్యంటే అపరిమిత ప్రేమ. ఇంట్లో ఏదైనా శుభ్రంగా లేకపోతే తను క్లీన్ చేస్తాడు తప్ప ఆమెని మందలించడు. తన ఫ్రెంచ్ కిస్ ముచ్చట తీరలేదనే అసంతృప్తి తప్ప గౌతమికి మరే అసౌకర్యం లేదు.

ఓ రోజు ఆఫీస్‌నించి వచ్చిన వసంత్ చెప్పాడు.

"ఆఫీస్ వాళ్ళు పదిహేను రోజులు స్వీడన్ వెళ్ళి రమ్మంటున్నారు. ఒక్కదానివే ఉండగలవా? లేక మీ ఇంటికి వెళ్తావా? ఎలాగైనా నాకు ఓ.కె. నీ ఇష్టం."

"అమ్మ దగ్గరకి వెళ్తాను" గౌతమి ఉత్సాహంగా చెప్పింది.

పుట్టింటికి వచ్చిన మొదటి రెండు రోజులు గౌతమి ఉత్సాహంగా భర్త గురించిన కబుర్లు చెప్పింది. తల్లి దగ్గర తనకి రాని వంటలు నేర్చుకుంది. వెళ్ళగానే వసంత్‌కి రోజుకో రకం వండిపెట్టాలి అనుకుంది.

మూడో రోజు చెప్పింది.

"నా ఫ్రెండ్ చారులత ఇంటికి వెళ్ళొస్తానమ్మా. ఇవాళ ఫ్రీగా ఉంటానంది. సాయంత్రానికల్లా వచ్చేస్తాను."

"జాగ్రత్త. ఫోన్ చార్జ్‌లో ఉంచుకో. వాళ్ళిల్లు ఎక్కడ?" ఆవిడ అడిగింది.

"యూనివర్సిటీ దగ్గరమ్మా. మెయిన్ బిల్డింగ్‌కి ఆనుకుని ఉన్న రోడ్లోంచి వెళ్ళాలి. నీకు చారులత నంబర్ కూడా ఇస్తాను" చెప్పింది.

"చాలా దూరమే. ఆటోలో వెళ్ళు. తిని వెళ్తావా? అక్కడ తింటావా?"

"అక్కడే తింటానమ్మా" చెప్పి గౌతమి బయటకి నడిచింది.

ముందుగా అనుకున్నట్లుగా స్నేహితురాళ్ళిద్దరూ ఓ రెస్టరెంట్ దగ్గర కలిసారు.

"అబ్బ! ఎన్ని రోజులైందో బయట తిని" ఫ్రైడ్ రైస్ తింటున్న గౌతమి ఆనందంగా చెప్పింది.

"అదేంటి? మనకన్నా సిటీ కదా అది?" చారులత ఆశ్చర్యంగా అడిగింది.

"కానీ వసంత్‌కి ఇష్టంలేదు.." భర్త గురించి చెప్పింది.

"బయట తినకపోతే కొంపలేం మునగవు. ఏం ఫర్వాలేదు. నేర్చుకుని ఇంట్లో వండుకో. మన ఫ్రెండ్ అరుణ వాళ్ళాయన ఎంత చెడ్డవాడంటే దానికి రోజూ నరకం చూపిస్తున్నాడట. ఆంటీ ఒకటే ఏడుపు" చారులత చెప్పింది.

"పాపం! వసంత్ చాలా మంచివాడు నేను లక్కీ" గౌతమి భయంగా చెప్పింది.

"మేట్నీకి వెళ్దామా?" చారులత అడిగింది.

"సరే పద. కాని చీకటి పడుతుందేమో సినిమా అయ్యేసరికి?"

"నిన్నెవరూ కొరుక్కుతినరులే, నేను దింపి వెళ్తాను" చారులత నవ్వింది.

సినిమా పూర్తయ్యేసరికి చీకటి పడుతోంది. అప్పటికి గౌతమికి వాళ్ళమ్మ నించి నాలుగు ఫోన్ కాల్స్ వచ్చాయి.

ఇద్దరూ ఆటో ఎక్కారు.

"నన్ను దగ్గర్లో దింపి, నువ్వు వెళ్ళిపో. నేను నడుచుకుంటూ వెళ్తాను" గౌతమి చెప్పింది.

యూనివర్శిటీ దగ్గర్లోని ప్రైవేట్ హాస్టల్స్ దగ్గర ఆటో ఆపి, చారులతకి జాగ్రత్తగా వెళ్ళమని చెప్పి గౌతమి నడకసాగించింది.

అకస్మాత్తుగా ఓ పొదచాటునించి రెండు చేతులు బలంగా ఆమెని పొదల్లోకి లాగాయి. ఆమె అరవకుండా నోరు గట్టిగా మూసి ఆ యువకుడు నిర్మానుష్యంగా ఉన్న ఆ మునిమాపు వేళలో గౌతమితో కఠినంగా చెప్పాడు.

"అరిచావంటే చచ్చావే. నోర్మూసుకుని ఉండు ఐదు నిమిషాలు" వాడు రెండో చేత్తో జేబులోంచి కత్తి తీసి నేలలో గుచ్చాడు.

గౌతమి భయంతో వణికిపోతూ కళ్ళు విప్పార్చి వాడినే చూడసాగింది. తనకన్నా చిన్నవాడు. స్టూడెంట్‌లాగా ఉన్నాడు. ఈ బుద్దేమిటి?

"ఎందుకలా గుడ్లప్పగించి చూస్తావ్?" కసిరి వాడు ఆమె పెదవుల మీద గాఢంగా చుంబించాడు.

దాదాపు పది నిమిషాలు అర్వాత లేచి కఠినంగా చెప్పాడు.

"మాట్లాడకుండా వెళ్ళిపో. పోలీస్ కంప్లైంట్ ఇచ్చావో వచ్చి ఈ చాకుతో పొడుస్తా. ఏమనుకుంటున్నావో!"

గౌతమి లేచి దుస్తులు సరిచేసుకుని స్వప్నావస్థలో ఉన్నట్లుగా నడుస్తూ ఇల్లు చేరుకుంది. బేగ్‌ని టేబుల్ మీద పడేసి, తల్లి ప్రశ్నలకి సమాధానం చెప్పకుండా బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది. మూడు బక్కెట్ల నీళ్ళతో శుభ్రంగా స్నానం చేసింది. అద్దంలో చూసుకుంటే ఒళ్ళంతా కందిపోయింది. పెదవులు వాచాయి. సాధ్యమైనంత వరకు సహజంగా ఉండడానికి ప్రయత్నిస్తూ బయటకి వచ్చింది.

"సినిమా హాల్ నించి చెరో ఆటోలో రావాల్సింది గదమ్మా. చూడు ఎంత లేటైందో. ఇంతకీ సినిమా ఎలా ఉంది?" తల్లి కాఫీ గ్లాస్ అందిస్తూ ఆదరంగా అడిగింది.

"సినిమా బానే ఉందమ్మా. నువ్వన్నట్లు చెరో ఆటో ఎక్కాల్సింది. ఐడియా రాలేదు. యూనివర్శిటీ పక్కన ఖాళీ స్థలాలు ఎక్కువ కదా దోమలు ఒకటే కుట్టాయి" చెప్పింది.

ఆ రాత్రి మంచం మీద చేరాక గౌతమికి గిల్టీగా అనిపించింది. ఇప్పుడు తనేం చేయాలి. ఏం జరగనట్లు తల్లితో కబుర్లు చెప్పినా ఒంటిమీద గాయాలు మంటపుడుతున్నాయి. వసంత్ మంచివాడైనా దీన్ని ఎలా తీసుకుంటాడో? తనకిష్టం, ప్రోత్సాహం లేని చర్యకాబట్టి ఎవరికీ చెప్పకూడదు అనుకుంది. వసంత్ వచ్చేలోగా పది రోజుల్లో ఈ గాయాలు తగ్గాలి.

గౌతమికి ప్రతీరాతి నిద్రపట్టడానికి ముందు వసంత్ తనని ఫ్రెంచ్ కిస్ చేసినట్లుగా ఫాంటసీ కలని ఊహించుకోవడం అలవాటు. ఆ రాత్రి కల్లో స్టూడెంట్ కుర్రాడు వచ్చాడు. ఊపిరాడకుండా పెదవులని కొరుకుతూ రాక్షసంగా...

ఆమె పక్కకి తిరిగిపోయింది. గౌతమి కళ్ళవెంట నీళ్ళు కారసాగాయి.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments